# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రాంతీయ అనుసంధానతను మెరుగుపరిచేందుకు సవరించిన ఉడాన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం న్యూఢిల్లీలో ఈ సాయంత్రం జరిగింది.
- ఆర్థిక బిల్లు 2026 కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ మొట్టమొదటి ఎడిషన్ ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ లో ఈ సాయంత్రం ప్రారంభమయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రాంతీయ అనుసంధానతను మెరుగుపరిచేందుకు సవరించిన ఉడాన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 28,840 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఏడాది నుంచి 2035-36 వరకు పదేళ్ల కాలానికి ఉడాన్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈరోజు అంగీకారం తెలిపింది. అదే విధంగా 1800 కోట్ల బడ్జెట్ కేటాయింపులతో ఇమ్మిగ్రేషన్ వీసా, విదేశీయుల రిజిస్ట్రేషన్ & ట్రాకింగ్ (IVFRT) పథకాన్ని మరో ఐదేళ్లు కొనసాగించడానికి సైతం ఈ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. ఇమ్మిగ్రేషన్ వీసా సేవలను ఆధునీకరించడం, ఉన్నతీకరించడం IVFRT యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఇది జాతీయ భద్రతను బలోపేతం చేస్తూ, చట్టబద్ధమైన ప్రయాణికులకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సవరించిన ఉడాన్ పథకంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆర్థిక వృద్ధి, వాణిజ్యం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభించనుందని కేబినెట్ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్…22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం న్యూఢిల్లీలోని పార్లమెంటు భవన సముదాయంలో ఈ సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, ఎస్. జైశంకర్, హర్దీప్ సింగ్ పూరి, కిరణ్ రిజిజు, జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా, రాజీవ్ రంజన్, లలన్ సింగ్‌తో పాటు ఇతర నాయకులు హాజరయ్యారు. విపక్ష పార్టీలకు చెందిన ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, జాన్ బ్రిట్టాస్, ధర్మేంద్ర యాదవ్, ఇతర నాయకులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. పశ్చిమ ఆసియాలోని పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటులో ప్రసంగించిన అనంతరం ఈ అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటులో తన ప్రకటనలో ప్రధానమంత్రి, ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా సంఘర్షణ ప్రభావాన్ని తగ్గించడానికి

ఇంధనం, సరఫరా గొలుసు, ఎరువులు తదితర రంగాలపై వ్యూహాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఏడు సాధికార బృందాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా లోక్ సభ ఈరోజు ఉదయం 11 గంటలకు సమావేశమయ్యింది. కార్యకలాపాల ప్రారంభానికి ముందుగా ఇటీవల మృతి చెందిన మాజీ కేంద్రమంత్రి కావూరి సాంబశివరావుకు సభ సంతాపం తెలిపింది. అనంతరం సభాపతి ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ కోవిడ్ అనంతర కాలంలో దేశవ్యాప్తంగా 1024 కొత్త రైళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. అదే విధంగా 4,651 కొత్త బోగీలు జోడించామని, 3 కోట్లకు పైగా నకిలీ IRCTC ఖాతాలను నిలిపివేసామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 3 గిగావాట్స్ గా ఉన్న దేశ సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యం, ప్రస్తుతం 172 గిగావాట్స్ కు పెరిగిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆ తరువాత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2010 విదేశీ విరాళాల (నియంత్రణ) FRCA చట్టాన్ని సవరించేందుకు ఈ బిల్లు ఉద్దేశించబడింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ఫైనాన్స్ బిల్లు-2026 కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను అమలు చేసేందుకు ఈ బిల్లు ఉద్దేశించబడింది. అంతకముందు ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ఈ ఆర్థిక బిల్లులో అనేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రాథమిక సహకార సంఘాలు ప్రస్తుతం తమ అనుబంధ సంఘాలకు పాలు, పండ్లు, కూరగాయలను సరఫరా చేసినందుకు మాత్రమే రాయితీలను పొందుతున్నాయని ఇకపై వాటిని పశువుల మేత, పత్తి విత్తనాల సరఫరాకు విస్తరిస్తామని చెప్పారు.

(వాయిస్…28 సెకన్లు)

అదే విధంగా.. సెలెక్ట్ కమిటీ నివేదించిన 'ది ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ (సవరణ) బిల్లు-2025'ను నిర్మలా సీతారామన్ పరిశీలన, ఆమోదం నిమిత్తం సభలో ప్రవేశపెట్టారు.

= = = = = = = = = = = = = = = = = = =

ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. లోక్ సభలో నిన్న ఆమోదం పొందిన ఈ బిల్లుపై ఈరోజు రాజ్యసభలో చర్చ చేపట్టి ఆమోదించారు. ఇక సభ అజెండా అంశాలలో భాగంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు CAPF (జనరల్ అడ్మినిస్ట్రేషన్) బిల్లు-2026 పై చర్చ చేపట్టారు. CAPF బలగాలలో గ్రూప్-ఎ జనరల్ డ్యూటీ అధికారులు ఇతర అధికారుల నియామకం, సేవా నిబంధనలను నియంత్రించే సాధారణ నియమాలను క్రమబద్ధీకరించడానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. ఇక ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఒక ప్రశ్నకు బదులిస్తూ పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాన్ని అందించేందుకు 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY) 4.0'ను ప్రారంభించామని చెప్పారు. స్వల్పకాలిక శిక్షణతో పాటు అప్ స్కిల్లింగ్, పునఃశిక్షణ (రీ స్కిల్లింగ్) ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. చర్చలనంతరం రేపు సెలవు కావడంతో పార్లమెంటు ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = =

పైప్డ్ లైన్ నేచురల్ గాస్(PNG) విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, అయితే LPG పంపిణీలో ఎటువంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ స్పష్టం చేశారు. వాణిజ్య LPG కేటాయింపులను ప్రభుత్వం 50 శాతానికి పెంచిందని తెలిపారు. ఈరోజు న్యూ ఢిల్లీలో నిర్వహించిన  అంతర మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ… దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని స్పష్టం చేశారు. దేశంలో

తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, వదంతులను నమ్మి ప్రజలు భయాందోళనకు గురికావొద్దని పౌరులకు సూచించారు.

(వాయిస్…28 సెకన్లు)

అదే విధంగా.. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న 540 మంది భారతీయ నావికులు సురక్షితంగా ఉన్నారని 50 మందిని స్వదేశానికి తిరిగి రప్పించామని, ఓడరేవుల్లో ఎటువంటి రద్దీ లేదని కేంద్ర జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ మొట్టమొదటి ఎడిషన్ ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ లో ఈ సాయంత్రం ప్రారంభమయ్యింది. కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయా ఈ ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్- 2026 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. భారతదేశం నలుమూలల నుండి 2వేల మందికి పైగా గిరిజన క్రీడాకారులు ఆర్చరీ, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్, వాలీబాల్, రెజ్లింగ్ మొదలగు 7 విభాగాల్లో పోటీపడనున్నారు. చత్తీస్గఢ్లోని మూడు నగరాలైన రాయపూర్, జగదల్పూర్, అంబికాపూర్ వేదికలుగా ఏప్రిల్ 3వరకూ ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =